సాఫ్ట్‌వేర్ కోర్సుల్లో శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కాచిగూడ: నేషనల్ అకాడమీ ఆఫ్ సైబర్ సెక్యూరిటీ ఆధ్వర్యంలో సైబర్ నిర్వహిస్తున్న సెక్యూరిటీ, ఎథికల్ హ్యాకింగ్ కోర్సుల్లో శిక్షణ కోసం తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ విమలారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న అనంతరం కేంద్ర ప్రభుత్వ సర్టిఫికెట్స్ ప్రదానం చేస్తామని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 21వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు ఫోన్ నం.78931 41797.

మర్యాదపూర్వక కలయిక



రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రాంచందర్‌రావును కలిసిన లేబర్ కోర్టు న్యాయవాదులు

చిక్కడపల్లి: తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్‌రావును లేబర్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.రఘురాంరెడ్డి మంగళవారం మర్యాదపూర్వకంగా కలశారు. అధ్యక్షుడిగా నియమిలైన తర్వాత మొదటిసారి రాంచందర్‌రావును కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాంచందర్‌రావు మాట్లాడుతూ... కార్మిక సంక్షేమం, పరిశ్రమలు, యాజమాన్యం తదితర సమస్యల సత్వర పరిష్కారానికి లేబర్ కోర్టు న్యాయవాదులు మరింత నిబద్ధతతో పనిచేయాలని అన్నారు.

విద్యతో పాటు క్రీడలు ముఖ్యమే

చర్లపల్లి జైలు డీఎస్పీ రత్నం

కాచిగూడ: విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలు ముఖ్యమేనని చర్లపల్లి జైలు డీఎస్పీ రత్నం అన్నారు. బెంగళూర్‌లో జరిగిన 13వ షోటోఖాన్ జాతీయ స్థాయి కరాటే పోటీల్లో శ్రీ చైతన్య స్కూల్ బర్కత్‌పుర బ్రాంచ్‌కి చెందిన 8వ తరగతి విద్యార్థి లక్కాకుల అన్విత్‌పటేల్ రెండు గోల్డ్ మెడల్స్ సాధించారు. అకాడమీ విద్యార్థులతో కలిసి ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్నారు. రెండు గోల్డ్ మెడల్స్ సాధించిన అన్విత్ పటేల్‌ను మంగళవారం కాచిగూడలోని జీవీఆర్ కరాటే అకాడమీలో చర్లపల్లి జైలు డీఎస్పీ రత్నం సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో అకాడమీ డైరెక్టర్ డాక్టర్ జీఎస్ గోపాల్‌రెడ్డి, కరాటే మాస్టర్స్ అమృతారెడ్డి, ఘన సంతోషిణిరెడ్డి, అవిఘ్న వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నీటి సరఫరాను యథావిధిగా కొనసాగించాలి



జలమండలి డీజీఎంకు వినతి పత్రం అందజేస్తున్న రాజ్‌దీప్, రమేష్

కవాడిగూడ: ముషీరాబాద్ పరిధిలోని జెమినీ కాలనీ, శాస్త్రీనగర్, ఉదయ్‌నగర్‌లో యథావిధిగా తాగునీటిని సరఫరా చేయాలని సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి రాజ్‌దీప్ అధికారులను కోరారు. ఈ మేరకు మంగళవారం పార్టీ సీనియర్ నేత రమేష్‌గౌడ్‌తో కలిసి జలమండలి డీజీఎం మోహన్‌రాజ్‌కు వినతి పత్రం అందజేశారు. గతంలో సాయంత్ర 5గంటలకు నీటిని సరఫరా చేసేవారని కొన్ని రోజులుగా రాత్రి 7గంటలకు వదులుతున్నారని ఆయనకు తెలిపారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని సాయంత్రం 5గంటలకు నీటిని సరఫరా చేయాలని కోరారు.

'రిజర్వేషన్లను రాజకీయానికి వాడుకుంటున్నాయి'

ఆప్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు రాముగౌడ్



కవాడిగూడ: బీసీ రిజర్వేషన్లను రాజకీయం చేయడానికి కాంగ్రెస్, బీజేపీలు వాడుకుంటున్నాయని ఆప్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు బుర్ర రాముగౌడ్ ఆరోపించారు. మంగళవారం దోమలగూడలోని ఆప్ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రిజర్వేషన్ల పేరిట హిందూ, ముస్లింల మధ్య చిచ్చుపెట్టేందుకు కుట్రలు చేస్తున్నారని అన్నారు. రాజ్యాంగబద్ధంగా అమలు చేయకుండా జాప్యం చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీకి వెళ్లి ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో కాంగ్రెస్ నేతలకు తెలంగాణ సామాజిక కులగణన సర్వే–2024 నమూన పద్ధతిపై ఇటీవల ప్రజెంటేషన్ ఇచ్చారన్నారు. కానీ సర్వే నివేదికను తెలంగాణ ప్రజా క్షేత్రంలో పెట్టడానికి ఎందుకు సమయం దొరకడం లేదని ప్రశ్నించారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు బీసీలకు 42శాతం రిజర్వేషన్లను కాంగ్రెస్ పార్టీ తెరపైకి తెచ్చిందన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు సెప్టెంబర్ 30లోగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్లు అమలు చేసేంత వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకొస్తామని అన్నారు.

రాత్రికి రాత్రే తవ్వేస్తున్నారు!

- వర్క్ ఇన్‌స్పెక్టర్ల కనుసన్నల్లోనే రోడ్ల తవ్వకాలు
- పట్టించుకోని జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ విభాగం అధికారులు



బాగ్‌అంబర్‌పేట నందన వనం కాలనీలో రోడ్డును తవ్విన దృశ్యం

అంబర్‌పేట: అడ్డగోలుగా రోడ్ల తవ్వకాలు జరుపుతున్నారు. నియోజకవర్గంలో అనుమతులు లేకుండా ఇష్టానుసారంగా రోడ్లను ఛిద్రం చేస్తున్నారు. ఎవరి అవసరాలకనుగుణంగా వారు అక్రమంగా రోడ్లను తవ్వుతంటే పట్టించుకోవాల్సిన అధికారులు ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారు. అంతేకాకుండా అక్రమ తవ్వకాలకు జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ విభాగం క్షేత్ర స్థాయి సిబ్బంది ప్రొత్సహిస్తున్నారు. ప్రధానంగా నల్ల కనెక్షన్, డ్రైనేజీ కనెక్షన్‌తో పాటు వాటి మరమ్మత్తులకు అనుమతి తీసుకుని చేపట్టాల్సి ఉంటుంది. అనుమతి తీసుకోకుండా రాత్రికి రాత్రి రోడ్లు తవ్వి పైపులైన్ పనులను పూర్తి చేసుకుంటున్నారు. తిరిగి రోడ్డును నిర్మించాల్సిన విషయాన్ని విస్మరిస్తున్నారు. తవ్వకాలు జరిపిన రోడ్డును మరమ్మత్తులు చేయకపోవడంతో కొంత కాలనికి రోడ్డు మొత్తం శిథిలావస్థకు చేరుకుంటోంది. దీంతో స్థానికులు రాకపోకలు సాగించడానికి నిత్యం అవస్థలు పడుతున్నారు. పట్టించుకోవాల్సిన అధికారులు చేతులెత్తేస్తున్నారు.

వర్క్ ఇన్‌స్పెక్టర్లదే రాజ్యం...

జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ విభాగంలో క్షేత్ర స్థాయిలో పని చేసే వర్క్ ఇన్‌స్పెక్టర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. రోడ్డు వేయాలన్నా రోడ్డును ధ్వంసం చేయాలన్నా వీరి కనుసన్నల్లోనే జరుగుతున్నాయి. పైపులైన్ పనులు చేపట్టడానికి జలమండలి విభాగం వద్ద అనుమతులు తీసుకుని చలాన్ చెల్లించాల్సి ఉంటుంది. రోడ్డు తవ్వడానికి జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ విభాగం వద్ద అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. తవ్విన రోడ్డు తిరిగి నిర్మించడానికి అయ్యే వ్యయంతో అనుమతి సమయంలో చలాన్ రూపంలో తీసుకుంటారు. చెల్లించిన చలాన్‌తో తవ్విన రోడ్డును తిరిగి నిర్మిస్తారు. వర్క్ ఇన్‌స్పెక్టర్లను సంప్రదిస్తే ఎలాంటి రోడ్డైనా తవ్వుకోవచ్చనే ధీమా నెలకొంది.

- ఇటీవల బాగ్‌అంబర్‌పేటలో ఓ కాలనీలో ఆదివారం ఓ భవన యాజమానికి ఎలాంటి అనుమతులు లేకుండా రోడ్డును తవ్వి పైపులైన్ పనులు చేపట్టడడం గమనార్హం. ప్రధానంగా బాగ్‌అంబర్‌పేట, అంబర్‌పేట డివిజన్లలో విధులు నిర్వహించే వర్క్‌ఇన్‌స్పెక్టర్లు కాసులకు కక్కుర్తి పడి వారికి సహకరిస్తున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. వీరు ఇంజినీరింగ్ విభాగంతో పాటు జలమండలి, విద్యుత్, ఇతర విభాగాల పనుల్లో సైతం జోక్యం చేసుకుంటూ అందినకాడికి దండుకుంటున్నట్లు సమాచార

పదేళ్లకుపైగా పాతుకుపోయారు...

అంబర్‌పేట, బాగ్‌అంబర్‌పేటలో విధులు నిర్వర్తిస్తున్న వర్క్‌ఇన్‌స్పెక్టర్లు పదేళ్లగా పాతుకుపోయారు. ఎంతో మంది ఈఈ, ఏఈలు వచ్చి పోయినప్పటికి వీరు మాత్రం బదిలీ కాకుండా ఇక్కడే ఉండిపోతున్నారు. ఏఈ, ఈఈలు వచ్చిన వారికి వీరే మార్గదర్శకులుగా వ్యవహరిస్తూ అన్ని విషయాల్లో చక్రం తిప్పుతున్నారు. వీరికి అసలు బదిలీలు ఉండవా అన్న అనుమానాన్ని ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు వీరి వ్యవహార శైలిపై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

సర్కిల్‌లో పటిష్టంగా లేని ఇంజినీరింగ్ విభాగం..

అంబర్‌పేట సర్కిల్ ఇంజినీరింగ్ విభాగం ఈఈ ఉన్నప్పటికి క్షేత్రస్థాయిలో పనులు, సిబ్బంది పని తీరుపై సమీక్ష కొరవడిందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఈఈ ఆశలత ఉన్నప్పటికీ ఆమెకు సికింద్రాబాద్ జోనల్ ఎస్‌ఈగా అదనపు బాధ్యతలు ఉండడంతో అక్కడే ఎక్కువగా దృష్టి పెడుతున్నట్లు సమాచారం. కార్యాలయంలో సైతం ఈఈ అందుబాటులో ఉండరని ప్రజలు ఫిర్యాదులు చేస్తున్నారు. ఈఈగా అదనపు బాధ్యతలు ఉండటంతో క్షేత్రస్థాయి సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని పలువురు పేర్కొంటున్నారు.

సమన్వయానికి చర్యలు తీసుకుంటా

అంబర్‌పేట సర్కిల్ ఇంజినీరింగ్ విభాగం జవాబుదారిగా ఉండేందుకు చర్యలు తీసుకుంటాను. అక్రమ రోడ్ల తవ్వకాలపై ఆరా తీసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు నివేదిస్తాను. ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తాను.

– డీఎంసీ మారుతీదివాకర్

సీవరేజీ పైపులకు మరమ్మతులు



గోల్నాక చౌరస్తా సమీపంలో చేపట్టిన పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ అమృత

నల్లకుంట: గోల్నాక చౌరస్తా మెయిన్ రోడ్డులో సీవరేజీ పైపులు పగిలిపోయాయి. దీంతో తాగునీరు రోడ్డుపై ఏరులై పారుతుడటంతో స్థానికులు ఈ విషయాన్ని కార్పొరేటర్ అమృత దృష్టికి తీసుకెళ్లారు. అందుకు స్పందించిన కార్పొరేటర్ మంగళవారం జలమండలి శివం సెక్షన్ మేనేజర్ రోహిత్‌తో కలిసి ఆ ప్రాంతంలో పర్యటించారు. అక్కడి పరిస్థితులను పరిశీలించిన జలమండలి మేనేజర్ ప్రధాన రహదారిలో పైపు పగిలిపోయినందున మరమ్మతులు చేపట్టే సమయంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుందని, అలాగే ఆ ప్రాంతంలో అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుల్ ఉన్నందున ట్రాఫిక్ పోలీసుల అనుమతి తీసుకోవాలన్నారు. దీంతో కార్పొరేటర్ వెంటనే కాచిగూడ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌తో ఫోన్‌లో మాట్లాడి సీవరేజీ పైపులు పగిలిన విషయాన్ని తెలిపారు. పగిలిన పైపులకు మరమ్మతులు చేసే క్రమంలో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని ఇన్‌స్పెక్టర్‌ని కోరారు. అందుకు ట్రాఫిక్ అధికారి సమ్మతించడంతో పాటు ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ఉండేందుకై ట్రాఫిక్ సిబ్బందిని అక్కడికి పంపించారు. ట్రాఫిక్ పోలీసుల నుంచి అనుమతి రావడంతో జలమండలి అధికారులు పగిలిన సీవరేజీ పైపులకు మరమ్మతు పనులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకుడు కేజే బాబు, ట్రాఫిక్ పోలీసులు, జలమండలి సిబ్బంది పాల్గొన్నారు.

త్వరలో బోర్‌వెల్ పనులు ప్రారంభిస్తాం



మాతృశ్రీ లేన్‌లోని పార్కులో స్థలాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ అమృత, కాంట్రాక్టర్

నల్లకుంట: నల్లకుంట డివిజన్ మాతృశ్రీ లేన్‌లో పార్కు నిర్మాణం కోసం సుమారు వేయి గజాల స్థలాన్ని కేటాయించింది. నూతనంగా ఏర్పాటు చేయనున్న పార్కు కోసం కేటాయించిన స్థలంలో బోరువెల్ వేయించాలని స్థానికులు కార్పొరేటర్ అమృతను కోరారు. అందుకు స్పందించిన కార్పొరేటర్ పార్కు స్థలంలో బోర్‌వెల్ ఏర్పాటు విషయమై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డితో మాట్లాడారు. అందుకు స్పందించిన కేంద్రమంత్రి బోర్‌వెల్ ఏర్పాటు కోసం తన ఎంపీ బడ్జెట్ నుంచి నిధులు మంజూరు చేశారు. ఈ క్రమంలో త్వరలో అక్కడ బోర్‌వెల్ ఏర్పాటు పనులు ప్రారంభించనున్న నేపథ్యంలో మంగళవారం కార్పొరేటర్ అమృత, కాంట్రాక్టర్ ఆ పార్కు స్థలాన్ని సందర్శించారు. పార్కులో బోర్ వెల్ ఎక్కడ వేయాలో పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. గురువారం(రేపు) మాతృశ్రీ లేన్‌లోని పార్కు స్థలంలో బోర్ వెల్ పనులు ప్రారంభిస్తారని తెలిపారు.

ఎస్బీహెచ్‌కాలనీ సమస్యలను పరిష్కరించండి



కార్పొరేటర్ పావనికి వినతిపత్రం అందజేస్తున్న ఎస్బీహెచ్ కాలనీవాసులు

చిక్కడపల్లి: గాంధీనగర్ డివిజన్‌లోని కాలనీలు, బస్తీలలో సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేకంగా కృషి చేస్తున్నామని కార్పొరేటర్ పావని అన్నారు. మంగళవారం డివిజన్‌లోని అశోక్‌నగర్ ఎస్బీహెచ్ కాలనీలో ఆమె పర్యటించారు. స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కాలనీలో వీధి దీపాలు వెలగడంలేదని, గుంతలమయంగా మారి రోడ్డుతో ఇబ్బందులు పడుతున్నామని, పార్కులో సమస్యలు తిష్టవేశాయని స్థానికులు చెప్పారు. సమస్యలను పరిష్కరించాలని ఆమెకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... సమస్యలను సంబంధిత శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్, డివిజన్ అధ్యక్షుడు నవీన్‌కుమార్, నేతలు శివకుమార్, కాలనీ అధ్యక్షుడు ధనుంజయ, సూర్యనారాయణ, మనోహర్, కిషోర్, రమేష్, ఐవీఎస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో అలసత్వం వద్దు



గోల్నాకలో ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

అంబర్‌పేట: ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వం వద్దని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అధికారులకు సూచించారు. మంగళవారం గోల్నాక డివిజన్‌లోని గంగానగర్, కమలానగర్, న్యూ గంగానగర్ తదితర ప్రాంతాల్లో ప్రజా సమస్యపై ఎమ్మెల్యే పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా దోమలు, వీధి లైట్లు, మురుగునీటి సమస్యలపై స్థానిక ప్రజలు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎమ్మెల్యే స్పందించి ప్రజలు చేసిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించి పరిష్కరించాల్సిందిగా అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆయన తెలిపారు. సమస్యల శాశ్వత పరిష్కారానికి అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగ అధికారులు, స్థానిక బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

సినీ కార్మికుల వేతనాలను పెంచాలి

- టీఎఫ్ఐఈఎఫ్ అధ్యక్షుడు వల్లభనేని అనిల్‌కుమార్



కార్మికశాఖ అదనపు కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న టీఎఫ్ఐఈఎఫ్ నేతలు

చిక్కడపల్లి: తెలుగు సినీపరిశ్రమలో పనిచేస్తున్న కార్మికుల వేతనాలను పెంచాలని తెలుగు ఫిలిం ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (టీఎఫ్ఐఈఎఫ్) అధ్యక్షుడు వల్లభనేని అనిల్‌కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని కార్మికశాఖ కమిషనర్ కార్యాలయంలో కార్మికశాఖ రాష్ట్ర అదనపు కమిషనర్ డాక్టర్ ఇ.గంగాధర్ ఫెడరేషన్ నేతలు 30శాతం వేతనాలను పెంచాలని చర్చలు జరిపారు. ఈ సందర్భంగా వినతిపత్రాన్ని అదనపు కమిషనర్‌కు అందజేశారు. అనంతరం ఫెడరేషన్ కార్యదర్శి అమ్మిరాజు, కోశాధికారి అలెగ్జాండర్‌లతో కలసి ఆయన మాట్లాడారు. ప్రొడ్యూసర్ కౌన్సిల్ నేతలతో చర్చించి సమస్యను పరిష్కరిస్తామని అదనపు కమిషనర్ చెప్పారన్నారు. సినీ రంగంలో 20,000 మందికి పైగా కార్మికులు పనిచేస్తున్నారని తెలిపారు. కార్మికుల న్యాయపరమైన వేతనే సమస్యలను పరిష్కరించాలని కోరారు. బుధవారంతో సినీ పరిశ్రమలో సందిగ్ధత తొలిగిపోతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

9న సికింద్రాబాద్‌లో యువ సమ్మేళనం

కాచిగూడ: స్పెక్ గ్రూప్ ఆధ్వర్యంలో ఈనెల 9వ తేదీన శనివారం సికింద్రాబాద్‌లోని ఎంబి బేతేల్ చర్చిలో యువ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ సీఈఓ డాక్టర్ ఎస్.అబ్రహాం తెలిపారు. ఈ సందర్భంగా జాబ్‌మేళాతో పాటు వ్యాపార మెళకువలపై యువతకు అవగాహన కల్పిస్తామన్నారు. యువత, వారి తల్లిదండ్రులు యువ సమ్మేలనంలో పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ధర్నాకు తరలిన కాంగ్రెస్ నేతలు

అంబర్‌పేట: బీసీ బిల్లు ఆమోదం కోసం కాంగ్రెస్ పార్టీ ఢిల్లీలో తలపెట్టిన ధర్నాకు ఆ పార్టీ అంబర్‌పేట నేతలు తరలివెళ్లారు. మంగళవారం ఢిల్లీకి చేరుకున్నారు. అక్కడ రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, ఇతర పార్టీ పెద్దలను కలిసారు. తరలివెళ్లిన వారిలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నాగభూషణంచారి, ఆడం రాజు, ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి తొలుపునూరి కృష్ణగౌడ్, లక్‌పతి యాదగిరి గౌడ్, నాగభూషణం చారి, రామ్మోహన్ తదితరులు ఉన్నారు.

నియామకం



నియామక పత్రం అందుకుంటున్న రజనీకుమార్ నేత

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ నేతకాని మహర్ విద్యార్థి సంఘం హైదరాబాద్ ఇన్‌చార్జిగాబిరేల్లి రజనికుమార్ నేత నియమితులయ్యారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన సమావేశంలో ప్రొ. జాడి ముసలయ్య, అధ్యక్షుడు సాయిని ప్రసాద్ నేత ఆయనకు నియమక పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఈఈ జాడి మదనయ్య, అడ్వకేట్ రాజేష్, అధికార ప్రతినిధి శివకార్తీక్, వినోద్, బాను ప్రసాద్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

- టీయూ–జేఏసీ ఛైర్మన్ సుల్తాన్ యాదగిరి



రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్‌ఛైర్మన్ జి.చిన్నారెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న జేఏసీ ప్రతినిధులు

కాచిగూడ: తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల (టీయూ) జేఏసీ ఛైర్మన్ సుల్తాన్ యాదగిరి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఉద్యమకారుల జేఏసీ ప్రతినిధులు మంగళవారం రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ జి.చిన్నారెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ఉద్యమకారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. అమరవీరుల కుటుంబాలకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. ప్రతి ఉద్యమకారుడికి 250 గజాల స్థలంలో ఇల్లు కట్టించి ఇవ్వాలన్నారు. అమరవీరుల పేరుతో 100 ఎకరాల్లో స్మృతివని నిర్మించాలని డిమాండ్ చేశారు. మలిదశ ఉద్యమంలో అమరులైన కుటుంబాలలో కొందరికే సహాయం అందిందని తెలిపారు. మిగతా కుటుంబాలకు రూ.10 లక్షల నగదుతో పాటు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని అన్నారు.

- స్వరాష్ట్ర పోరాటంలో ఉద్యమకారులు చదువులు, కొలువులు, ఉపాధి కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. త్యాగాల పునాదులపై అధికారంలోకి వచ్చిన కేసీఆర్ ఉద్యమకారులను పూర్తిగా విస్మరించారని ఆయన ఆరోపించారు. ఉద్యమకారుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నేతలు కె.రాజేంద్రప్రసాద్, డోలక్ యాదగిరి, మోత్కూరి మల్లేష్, గుండా యాదగిరి ఏలూరి బాబన్న, గాజుల యాదగిరి, విజయలక్ష్మి, చిలుక శారదా, సుగుణమ్మ, చంద్రకళ, గంగిరాజు, గుండమల్ల శ్రీను, కోటేశ్వరరావు, ఎన్.స్వరూప, బి.లక్ష్మి, గంధమల్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

విద్యాహక్కు చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి



సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్‌రెడ్డి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ రాష్ట్రంలో విద్యాహక్కు చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని ఎంవీ ఫౌండేషన్ జాతీయ కన్వీనర్ వెంకట్‌రెడ్డి అన్నారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సాధన సంస్థ ఆధ్వర్యంలో విద్యాహక్కు చట్టం అమలు తీరుపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. పిల్లలు సంతోషంగా ఉండటమే ప్రజాస్వామ్యమని అన్నారు. బాలల హక్కులను పరిరక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పిల్లల అభిరుచులను అర్థం చేసుకుని నడుచుకోవాలన్నారు. సాధన సంస్థ డైరెక్టర్ సీహెచ్ మురళీమోహన్ మాట్లాడుతూ.... రాష్ట్ర జనాభాలో పిల్లలు 40 శాతం పైగా ఉన్నారని పేర్కొన్నారు. విద్యాహక్కు చట్టంలోని సెక్షన్ 17 ప్రకారం పిల్లలపై ఎలాంటి భౌతికదాడులు చేయొద్దని ఉందన్నారు. పాఠశాలలో ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. పిల్లలు లేరనే సాకుతో పాఠశాలలను మూసేయాలనే ప్రయత్నాన్ని విరమించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ సంస్థల ప్రతినిధులు ఆంజనేయులు, రమేష్, నాగరాజు, అందె వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణను కేంద్రం ఆమోదించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సాధినేని వెంకటేశ్వరరావు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: 42 శాతం బీసీ రిజర్వేషన్‌తో పాటు ఎస్సీ కుల వర్గీకరణకు రాజ్యాంగ సవరణ చేసి 9వ షెడ్యూల్డ్‌లో చేర్చి పటిష్టంగా అమలు చేయాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాధినేని వెంకటేశ్వరరావు, అధికార ప్రతినిధి జేవీ చలపతిరావు డిమాండ్ చేశారు. పార్లమెంట్ సమావేశాలలోని ఈ బిల్లులను ఆమోదించాలని వారు కోరారు. మంగళవారం రాంనగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ల పెంపు, ఎస్సీ కులాల వర్గీకరణకు శాసనసభలో తీర్మానం చేసి ఏకగ్రీవంగా ఆమోదించిందని తెలిపారు. రాజ్యాంగ సవరణ బాధ్యత కేంద్ర ప్రభుత్వంపైనే ఉందన్నారు. మోదీ ప్రభుత్వం తెలంగాణ శాసన సభ ఆమోదాన్ని బేషరతుగా పార్లమెంట్‌లో బిల్లును ప్రవేశపెట్టి ఆమోదించాలని డిమాండ్ చేశారు. పలు బీజేపీ పాలిత రాష్ట్రాలలో రిజర్వేషన్లు అమలు చేస్తున్నారని తెలిపారు. ఈ రిజర్వేషన్లను ప్రైవేట్ రంగంలోనూ ప్రవేశపెట్టాలని కోరారు.

బోడేపూడి స్ఫూర్తితో రైతాంగం ఉద్యమించాలి



బోడేపూడి వెంకటేశ్వర్‌రావుకు నివాళులర్పిస్తున్న రైతు సంఘం నేతలు

చిక్కడపల్లి: వ్యవసాయ రంగ పరిరక్షణకు రైతుల మనుగడకు విశాల ఐక్యతతో రైతాంగ ఉద్యమాలు బోడేపూడి స్ఫూర్తితో కొనసాగించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్ పిలుపునిచ్చారు. మంగళవారం జవహర్‌నగర్‌లో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యాలయంలో మధిర శాసనసభ పక్షనేత బోడేపూడి వెంకటేశ్వర్‌రావు వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఆయన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం సీనియర్ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి, ప్రొఫెసర్ అరిబండి ప్రాసద్‌రావు, జంగారెడ్డి, మూడ్‌శోభన్, వెంకట్రాములు, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం.!

కవాడిగూడ: బాకారంలో ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లవెల్లి అంజిరెడ్డి మంగళవారం మల్లికార్జునస్వామి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు మల్లికార్జున్‌రెడ్డి, బాకారం భ్రమరాంబ, మల్లికార్జునస్వామి దేవాలయ మాజీ ఛైర్మన్ ఊర్మిళ, దేవాదాయ శాఖ ఈవోలు సత్యనారాయణ, రఘు, సిబ్బంది సురేష్ పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.



మత్తుపదార్థాలు విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు



అంబర్‌పేట: గుట్టుచప్పుడు కాకుండా మత్తు పదార్థలను విక్రయిస్తున్న ఓ వ్యక్తి పోలీసులు పట్టుకున్నారు. ఈ సంఘటన మంగళవారం అంబర్‌పేట పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. డీఐ హాఫీజ్ తెలిపిన వివరాల ప్రకారం... రాజస్థాన్‌కు చెందిన మంగ్లా రామ్(44) జీవనోపాధి కోసం నగరానికి విచ్చేసి చెంగిచర్లతో నివాసం ఉంటున్నాడు. ఇతను సులువుగా డబ్బులు సంపదించడానికి రాజస్థాన్ నుంచి మత్తు, తాత్కలిక శక్తినిచ్చే పప్పీ(హస్క్) విక్రయించేందుకు సిద్ధపడ్డాడు. రాజస్థాన్ నుంచి ముడిసరుకుని తీసుకువచ్చి ఇక్కడ పొడిరూపంలో గుట్టుచప్పుడు కాకుండా విక్రయిస్తున్నాడు. ఇతను అంబర్‌పేట మున్సిపల్ గ్రౌండ్ సమీపంలో విక్రయిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు హెచ్‌న్యూ బృందం అంబర్‌పేట పోలీసుల సహకారంతో అతడిని పట్టుకున్నారు. అతని వద్ద రూ.1.35 లక్షల విలువైన మత్తు పదార్థం, ద్విచక్ర వాహనం, సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.